క్లుప్తంగా

తనిష్క్‌లో ప్రత్యేక ఆఫర్లు

హన్మకొండ: హనుమకొండ అంబేడ్కర్ కూడలిలోని తనిష్క్ జ్యువెల్లర్స్‌లో అక్షయ తృతీయను పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు ఫ్రాంఛైజీ మేనేజింగ్ పార్ట్‌నర్ యశోద నారాయణరావు గురువారం తెలిపారు. పాత బంగారం మార్పిడిపై వంద శాతం విలువను పొందే సౌకర్యం కల్పించామని, ఈ ఆఫర్ ఈ నెల 12 వరకు కొనసాగించనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో వివరించారు. ఈ నెల 10న అక్షయ తృతీయ రోజున కస్టమర్లకు ఆహ్లాదకరమైన షాపింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, ముందస్తు ఫ్రీ బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 7గంటల నుంచి షోరూం తెరిచి ఉంటుందని పేర్కొన్నారు. బంగారు ఆభరణాల మేకింగ్ ఛార్జెస్‌పై 20శాతం, వజ్రాభరణాల విలువపై 20 శాతం తగ్గింపు అందిస్తున్నామని వివరించారు. ప్రత్యేకంగా 'కాకతీయ కలెక్షన్'ను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు అభినందన



న్యూశాయంపేట : పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన హనుమకొండ పెద్దమ్మగడ్డ వద్ద మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన బ్లెస్సన్‌కుమార్, సాయి స్నేహిత్‌లను గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ అభినందించారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను, ప్రిన్సిపాల్ జంగా సతీష్ పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజల సంక్షేమం



ఖిలా వరంగల్: దేశ రక్షణ, పేద ప్రజల సంక్షేమం కోసం శ్రమించే శ్రామికుడు నరేంద్ర మోదీ అని బీజేపీ రాష్ట్ర నేత, అర్బన్ కో ఆపరేటీవ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఆపార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం తూర్పుకోట హనుమాన్ జంక్షన్‌లో బీజేపీ జోనల్ ఇన్‌చార్జ్ కందిమల్ల మహేష్ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో నంద్రే అమర్‌నాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు

ఎమ్మెల్యేకు వినతి



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్దార్థనగర్ వడ్డెపల్లి ట్యాంక్‌బండ్ ప్రధాన రహదారిపై బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి గురువారం కాలనీవాసులు రాత్రి వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ ఎలకంటి రాములు ఆధ్వర్యంలో కాలనీ పెద్దలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి బార్ ఏర్పాటు వల్ల జరిగే ఇబ్బందులను వివరించారు.

నామమాత్రపు కొనుగోళ్లు

కాజీపేట: సోమిడి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కేంద్రంలో వరి ధాన్యం కొనుగోళ్లు నామమాత్రంగా కొనసాగుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దర్గాకాజీపేట సహకార సంఘం ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా ధాన్యం సేకరణ ప్రారంభమైంది. వేసవి ఎండలు మండిపోతున్నప్పటికీ అన్నదాతలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాలు పడితే ఎలా అనే ఆందోళనలో రైతులు సతమతమవుతున్నారు. కొనుగోళ్లలో వేగం పెంచాలని సహకార సంఘం డైరెక్టర్ కాయిత రాజ్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.

హోటల్‌లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



వరంగల్ క్రైం: ఎన్నికల సమయంలో బెల్ట్ షాపులపై విరుచుకుపడుతున్న పోలీస్ అధికారులు.. తమకు అనుకూలంగా ఉన్న దుకాణాలపై కన్నెత్తిచూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాజీపేట సబ్ డివిజన్.. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిని అనుకుని ఉన్న ఓ హోటల్‌లో మద్యం ఏరులై పారుతున్నా పోలీస్ అధికారులకు కనిపించకపోడం విడ్డూరం. సాధారణంగా నడిచే వైన్‌షాపులో ఎంత మద్యం అమ్ముడు పోతుందో.. ఆ హోటల్‌లో అంత మద్యం అమ్ముడు పోతున్నట్లు సమాచారం. పోలీస్‌స్టేషన్‌కు అతి దగ్గరగా ఉన్న ఆ హోటల్‌పై స్థానిక పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నది అర్థంకాని ప్రశ్నగా మిగిలింది. స్థానిక పోలీస్ అధికారులు కాసులు కురిపించే భూపంచాయితీలకు పెద్ద పీట వేస్తూ.. ఎన్‌ఫోర్స్ మెంట్ విధులను గాలికి వదిలివేశారనే విమర్శలు సహితం ఉన్నాయి.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



కడిపికొండలో బొడ్రాయికి మొక్కుతున్న కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, మేయర్, తదితరులు

మడికొండ: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం కాజీపేట మండలం మడికొండ 46,64 డివిజన్‌లో ఎమ్మెల్యే నాగరాజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగలన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల పవన్, దిలీప్‌రాజ్, రఘుచందర్, ప్రభాకర్, లింగమూర్తి, మోహన్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. పార్లమెంట్ ఎన్నికల్లో జంగా రాఘవరెడ్డి వర్గం కడియం కావ్యకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గురువారం జంగా రాఘవ రెడ్డి వర్గం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను సైతం కలిసి మద్దతు తెలిపారు.

కాజీపేట: వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య గెలుపు కోసం సీపీఐ కార్యకర్తలు అంకితభావంతో మరింతగా కష్టపడి పనిచేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కల్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. కాజీపేట మండల కేంద్రంలోని ఏఆర్ఆర్ నగర్, వైఎస్సార్ నగర్ కాలనీల్లో సీపీఐ పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. సోమిడి గ్రామంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రచారాన్ని నిర్వహించారు.

కాశిబుగ్గ: కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ అన్నారు. గురువారం వరంగల్ రైల్వే స్టేషన్ జంక్షన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రంజిత్, గూడ శారద, గోవర్దన్, సురేందర్, నహిమా, ఫర్జానా, విజయ, జహీరా పాల్గొన్నారు.

హన్మకొండ: కడియం కావ్యను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఉప్పలయ్య అన్నారు. గురువారం హనుమకొండలోని సమ్మయ్యనగర్, ఇంజనీర్స్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. బొట్ల లత, జీడిమెట్ల అరుణ, రాజేష్, సుజాత, జయ, వెంకన్న పాల్గొన్నారు.

బొడ్రాయికి మొక్కి..

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని బొడ్రాయికి మొక్కిన కడియం కావ్య చేతి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను ప్రార్థించారు. కడిపికొండ రామాలయం వీధి, రాంపేట గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే నాగరాజుతో కలిసిప్రచారం నిర్వహించారు. బస్కే శ్రీలేఖ కృష్ణ, సర్మెట వెంకటరమణగౌడ్, రమేష్ పాల్గొన్నారు.

న్యూశాయంపేటలో..

31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేటలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి కావ్యను గెలిపించాలని కోరారు. మామిండ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విస్తృత ప్రచారం

రామన్నపేట: నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలోని గాంధీ విగ్రహం నుంచి పాపయ్యపేట మసీద్ వరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, నాయకులు గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. బుద్ధ జగన్, ఓరుగంటి పూర్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని ఆదరించండి



మడికొండలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

మడికొండ: భారత రాష్ట్ర సమితి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్ గారి కారుగుర్తుకు ఓటు బీఆర్ఎస్‌ను ఆదరించాలని కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి అన్నారు. మడికొండ 46వ డివిజన్‌లో 64వ డివిజన్‌లో గురువారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు పర్చకుండా ఎన్నికలకు వస్తుందన్నారు. తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాయిలు, రాజు, వెంకటస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

హసన్‌పర్తి: బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు కోరుతూ గురువారం ప్రచారం నిర్వహించారు. హసన్‌పర్తి, భీమారం, కోమటిపల్లి, దేవన్నపేట, చింతగట్టు, వంగపహాడ్, పెగడపల్లి, ముచ్చర్లల్లో ప్రచారం సాగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ రాజునాయక్, శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, రవీందర్, రజనీకుమార్, చంద్రమోహన్, విక్టర్‌బాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ: బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు క్యాతం రంజిత్ పిలుపునిచ్చారు. గురువారం కాశిబుగ్గలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కిరణ్‌కుమార్, కిషోర్, చిరంజీవి, హరీశ్, పాపయ్య, రాజ్‌కిరణ్, బాలు, వరుణ్, పవన్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడిని గెలిపించండి

వరంగల్/కాశిబుగ్గ : రాజకీయ, సొంత ప్రయోజనాల కోసం పార్టీలు మారుతున్న ద్రోహులను ఓడించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుడు వరంగల్ ఎంపీగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం పోచమ్మమైదాన్ జంక్షన్, సాయంత్రం వెంకట్రామా జంక్షన్‌లలో జరిగిన కార్నర్ మీటింగ్‌లలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మెట్టు శ్రీనివాస్, డాక్టర్ హరిరమాదేవి, అచ్చ విద్యాసాగర్, మసూద్, శ్రీమాన్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి: ప్రస్తుతం సర్వేలో బీఆర్ఎస్ అభ్యర్థి అన్ని పార్టీల కంటే ముందంజలో ఉన్నాడని ఆ పార్టీ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు కోరుతూ హసన్‌పర్తి మండల కేంద్రంలో గురువారం రాత్రి ప్రచారం నిర్వహించారు. వాసుదేవారెడ్డి, పావుశెట్టి శ్రీధర్, నరేడ్ల శ్రీధర్, వెంకటేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌గౌడ్, చంద్రమోహన్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

● ఎమ్మెల్యే నాగరాజు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలం పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్లా గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ సూదుల కొమురారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మేర్గు ప్రభాకర్‌తోపాటు భారీ ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి, మాట్లాడారు. పార్టీలో కొత్తపాత అనే బేధం లేకుండా అందరికీ సమప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేసి పార్టీ బలపరిచిన లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలపించాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మేడిపల్లి మధన్‌గౌడ్, దేవరకొండ అనిల్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాషబోయిన సంపత్‌యాదవ్ పాల్గొన్నారు.

కేయూలో ఇద్దరు పరిశోధకులకు డాక్టరేట్



బోనగాని నరేష్ బోడ శ్రీనివాస్ బేతి రమేశ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇద్దరు పరిశోధకులకు డాక్టరేట్‌ను ప్రకటించింది. ఫార్మసూటికల్ సైన్సెస్ కళాశాలలోపరిశోధకుడు బోనగాని నరేష్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఫార్మసీకళాశాల ప్రొఫెసర్ ప్రసాద్ పర్యవేక్షణలో నరేష్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారని కేయూ పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి తెలిపారు.

బోడ శ్రీనివాస్‌కు..

కేయూ ఫిజిక్స్ విభాగం పరిశోధకుడు బోడ శ్రీనివాస్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఆ విభాగం ఆచార్యులు వెంకట్రామ్‌రెడ్డి పర్యవేక్షణలో శ్రీనివాస్ తన పీహెచ్‌డీ పూర్తిచేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి వెల్లడించారు.

హసన్‌పర్తి: గోపాపురం సురేంద్ర కాలనీకి చెందిన బేతి రమేశ్ డాక్టరేట్ అందుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య వై.రెడ్డి శ్యామల పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. రమేశ్ ప్రస్తుతం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నాగసముద్రాలలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఠాకూర్ రతన్‌సింగ్

రామన్నపేట: రానున్న పార్లమెంట్ ఎన్నికలలో యువత ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని వరంగల్ జిల్లా కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధ్యక్షుడు ఠాకూర్ రతన్‌సింగ్ అన్నారు. గురువారం నగరంలోని ఏవీవీ జూనియర్ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొడిమాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా 'ఐ ఓటు ఫర్ షూర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రతన్‌సింగ్ మాట్లాడుతూ యువత, వ్యాపారులు తప్పనిసరిగా ఓటు హక్కు సద్వినియోగించుకొని సమర్థులైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. అనంతరం 'అందరూ ఓట్లు వేయండి, వేయించండి, వరంగల్ పట్టణంలో పోలింగ్ శాతాన్ని పెంచుదాం' అని వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కన్స్యూమర్ అవేర్నెస్ బాధ్యులు బండా కాళిదాస్, కే.విజయరావు, అధ్యాపకులు శ్రీనివాస్, వలంటీర్లు శివరామకృష్ణ, సాయి, నిజాముద్దీన్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఏఆర్‌ఓ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని ఏఆర్ఓ, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సెక్టార్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల దృష్ట్యా వరంగల్ తూర్పు నియోజక వర్గ పరిధిలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రం వద్ద అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, పరిశీలించాల్సిన విషయాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ టీంలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు. సెక్టార్ అధికారులు పోలింగ్ స్టేషన్లపై సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి మౌలిక సదుపాయాలు సరి చూసుకోవాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ఈవీఎం, పోలింగ్ మెటీరియల్ వాహనాలు ఎస్కార్ట్‌తో బయలుదేరాలని స్పష్టం చేశారు. సమావేశంలో వరంగల్ తహశీల్దార్ ఇక్బాల్, ఏఎల్ఎంటీలు సందీప్, కనకయ్య ,నాగరాజు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

కడియం కావ్యకు ఆర్యవైశ్యుల మద్దతు



కావ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రకాశ్ రావు

వరంగల్ చౌరస్తా: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యకు మహానగరంలోని ఆర్యవైశ్యుల సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు నగర మాజీ మేయర్ గుండా ప్రకాశ్ రావు ప్రకటించారు. గురువారం ఆర్యవైశ్య సంఘం నాయకులు కడియం కావ్యను హనుమకొండలో కలిసి పుష్పగుచ్ఛం అందచేసి, మద్దతు తెలిపారు. వీరన్న, వీరమల్లయ్య, రమణయ్య ఉన్నారు.

తెలంగాణ మాదిగ సంఘాల మద్దతు

నయీంనగర్: తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి మద్దతు కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకే ఉంటుందని చైర్మన్ పోకల కిరణ్‌కుమార్ మాదిగ తెలిపారు. గురువారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఏజెంట్‌గా మారిన మాదిగల ద్రోహి మంద కృష్ణ మాదిగను నమ్మవద్దన్నారు. భిక్షపతి మాదిగ, సంగీతపు రాజలింగం మాదిగ, గోవిందు పాల్గొన్నారు.

పెన్షన్ నిధుల మంజూరుపై హర్షం

వరంగల్: తెలంగాణ రాష్ట్రంలోని మార్కెట్ కమిటీలలో 5నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల జీతాలు, పెన్షనర్ల పెన్షన్ల ప్రభుత్వం మంజూరు చేయడంపై ఉమ్మడి వరంగల్ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగపురి సారయ్య, ప్రధాన కార్యదర్శి జారతి సత్యనాద్‌లు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

కాశీవిశ్వేశ్వరాలయం వార్షికోత్సవాలు

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని చారిత్రక కాశీవిశ్వేశ్వరాలయంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు పంచమ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ పునరుద్ధీకరణ, దేవాలయం చుట్టూ దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన జరిగి ఐదు సంవత్సరాలు పూర్తయినందున మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ విశేష పూజలు, చివరి రోజున విగ్రహ మూర్తులకు అభిషేకాలు, మహహరతి తీర్థప్రసాద వితరణ ఉంటుందని వెల్లడించారు.

కరపత్రాల పంపిణీ

హసన్‌పర్తి: నగరంలోని గోపాలపురం, దేవన్నపేట, కోమటిపల్లిల్లో గురువారం తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీ జేఏసీ) ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ చేశారు. మోదీకి ఓటు ఎందుకు వేయాలని ఇంటికి వెళ్లి పత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీపీ జేఏసీ కో-కన్వీనర్ రమాదేవి, కన్వీనర్లు సుదర్శన్‌రెడ్డి, కళ, అనిత, కుమారస్వామి, పున్నం చందర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో జేఆర్ఎఫ్, యూజీసి ఫెల్లోషిప్‌లు కలిగిన దివ్యాంగ అభ్యర్థులు పలువురికి పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పించకుండా యూనివర్సిటీ అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో దివ్యాంగ అభ్యర్థులు, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు గురువారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డిని కలి సి వినతిపత్రం సమర్పించారు. యూజీసీ నిబంధనల ప్రకారం త్రిమెన్ కమిటీవేసి అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డి స్పందిస్తూ నాలుగురోజుల్లో అడ్మిషన్లపై చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు విద్యార్థిసంఘాల బాధ్యులు తెలిపారు. బొమ్మెర సతీష్, విజయ, దాసరి శ్రీనివాస్, సంతోష్‌కుమార్, రాజునాయక్, ప్రశాంత్, శివ, రాజిరెడ్డి, నాగరాజు, సురేష్, మహేష్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మామునూరు: వరంగల్ 43వ డివిజన్ టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలోని సాయి బాబా గుడి ఎదురుగా పలు కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో గురువారం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఊరుగొంగ భిక్షపతి, అరుణ, రఘు, స్రవంతి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కాశిబుగ్గ: ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు గురువారం మృతి చెందాడు. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 55-60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన గుర్తు తెలియని వృద్ధుడు గత మంగళవారం వరంగల్ రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్ ఫాంలో కాళ్లకు గాయాలతో(పుండ్లు) అపస్మారక స్థితిలో ఉన్నాడని తెలిపారు. గమనించిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ రమేశ్ 108ద్వారా చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడని తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు, గుర్తింపు కార్డులు లేకపోవడంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిసినచో రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజు 94415 57132, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని సీఐ నరేష్ సూచించారు.

కాజీపేట రైల్వే యార్డులో అగ్నిప్రమాదం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే యార్డులో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. పాత రైలు కోచ్‌ను కట్ చేస్తుండగా బోగి అడుగున ఉన్న ఆయిల్ ట్యాంకర్‌కు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేసి ప్రమాదాన్ని నివారించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

కాశిబుగ్గ: ఫర్టిలైజర్స్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫిరోజ్ అలీ, ప్రధాన కార్యదర్శి షేక్ అజ్మత్ అన్నారు. ఫర్టిలైజర్స్ కాంట్రాక్టర్లు సొంత లారీలతో రవాణా చేస్తూ అడిగిన మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. గురువారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు శ్రీధర్‌రెడ్డి, ఎండీ నజీర్, మధు, మనోహర్‌లు మే 1న డబ్బులు అడుగుతున్నామని మాపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. ఆవిషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసోసియేషన్ లారీలతోపాటు మీ లారీలు కూడా సీరియల్ పెట్టి ఎరువులు రవాణా చేయాలని డిమాండ్ చేస్తుంటే దానిని తప్పుదోవ పట్టించడానికి కక్షపూరిత తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్లు మాపై చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకుని అసోసియేషన్ లారీలతోపాటు మీ లారీలు సీరియల్ పెట్టి ఎరువులు రవాణా చేయాలని కోరారు. సమావేశంలో ఎండీ మహమ్మద్ ఆలీ, ఎండీ యూసఫ్ పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అల్లం నాగరాజు

వరంగల్: వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్‌పై, పార్టీలో గ్రూపు తగాదాలు తలెత్తాయని, వర్గపోరు ప్రారంభమైందని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు సోషల్ మీడియా గ్రూపుల్లో చేస్తున్న అబద్ధపు ప్రచారాలను మానుకోవాలని వరంగల్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ అల్లం నాగరాజు అన్నారు. గురువారం దేశాయిపేటలోని తూర్పు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అల్లం నాగరాజు మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు ఓటమి భయంతో బీజేపీపై ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నాయని అన్నారు. ఆయా పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పేరోజు దగ్గరలోనే ఉందన్నారు. సోషల్ మీడియాలో చేస్తున్న అసత్య వీడియోలపైన పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, గోక వెంకట్, జన్ను సుబ్రమణ్యం, చింతల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

15నుంచి 21వరకు వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట దూపకుంట రోడ్డులోని శ్రీకార్యసిద్ధి హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో బాల సంస్కార్ ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణ మఠం-హైదరాబాద్ వారి నేతృత్వంలో హనుమాన్ సేవా సమితి సహకారంతో ఈనెల 15 నుంచి 21వరకు వ్యక్తిత్వ వికాస శిక్షణ విక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు దేవులపెల్లి దయాకర్ తెలిపారు. ఈమేరకు గురువారం శంభునిపేటలోని శ్రీకార్యసిద్ధి హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. వేసవిలో 4వ తరగతి నుంచి 10వ తరగతి బాలబాలికలకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, భగవద్గీత శ్లోకాలు, తెలుగు నీతిపద్యాలు, ఏకాగ్రత రహస్యములు, సమయ పాలన, దేశభక్తి, భారతీ వారసత్వ వైభవం, మాతృపితృ భక్తి గురు పరంపర, భజనలు, ఆచారాలు, సంప్రదాయాలు, గుణాత్మకమైన ఆటలు, చిత్రలేఖనం, రామాయణ మహాభారతాది ఇతిహాసాల నుంచి కథా దర్శనంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణలో అల్పాహారం, నిమ్మరం, మజ్జిగ అందిస్తామని పేర్కొన్నారు.

పట్టణాల్లో ఓటింగ్ శాతం పెంచాలి



సమావేశంలో పాల్గొన్న వ్యాపారులు, రైతులు

వరంగల్ : ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్యం మనుగడ సాధిస్తుందని జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ లోక్ సభ నియోజకవర్గం పరిధిలోని తూర్పు నియోజకవర్గానికి సంబంధించి స్వీప్-2024 అవగాహన సదస్సు 14వ డివిజన్ ఏనుమాముల మార్కెట్ యార్డులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉండడం ఆందోళనకరమన్నారు. ఐదేళ్లకు ఒకసారి నాయకులను ఎన్నుకునే అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని, పోలింగ్ శాతం పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అడ్తివ్యాపారులు, రైతులు, గుమస్తాలు, దడువాయిలకు ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. డీఎంఓ ప్రసాదరావు, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి రెడ్డి, రాజేశ్‌కుమార్‌గౌడ్, సత్యవాణి, శ్రీనివాస్, రమేశ్, శ్రీలత, ప్రవీణ్, రమ, అలీ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే..

● తక్కళ్లపల్లి శ్రీనివాస రావు

ఖిలా వరంగల్: బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. ఇండియా కూటమి అభ్యర్థి కడియం కావ్య విజయం ఆకాంక్షిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం పలు డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ప్రజలను మోసం చేసిన మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పదేళ్ల మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టడంతోనే సాగిందని ఆరోపించారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ పబ్బం గడుపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే బాషమియా, జాన్‌పాల్, సువర్ణ, రాజు, చిరంజీవి, దీపిక, రాజుకుమార్, రమేష్, కిరణ్ పాల్గొన్నారు.